## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో జేసీబీతో చెత్త తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. జి.కొత్తపల్లిలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరు వైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీశారు. గ్రామం నలు మూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీచేశారు. సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

### భారత్ కో జానో క్విజ్ పోటీల్లో శ్రీప్రకాష్ ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తుని: భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ కో జానో క్విజ్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ మూర్తి ఆదివారం తెలిపారు. శనివారం తుని రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో హర్షిత, లలిత శరణ్యల, జూనియర్స్ విభాగంలో అజితేష్ త్రిపాఠి, గణేష్ పార్థులు ప్రథమ స్థానం సాధించారన్నారు. త్వరలో విశాఖపట్నం జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, విజయ్‌ప్రకాష్ అభినందించారు.

### అన్ని వర్గాల ప్రజలకూ మేలు



ఒమ్మంగిలో సీఎం జగన్, ఎమ్మెల్యే పర్వత చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చిన బాబు అన్నారు. ఒమ్మంగిలో వైఎస్సార్ కాపు నేస్తం సొమ్ములు వరుసగా 4వ ఏడాది లబ్ధిదారుల ఖాతాల్లో జమకావడంతో కాపు మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ తమ గ్రామంలో 325 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ కాపు నేస్తం సొమ్ములు జమ అయినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, వైఎస్సార్ సీపీ స్థానిక నేత రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం



నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, రాతికింది కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న కోలాటం

కొత్తపల్లి: కొండెవరంలో ఉన్న పాటిమీద రామాలయం వద్ద ఆదివారం రాత్రి జరిగిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. రామాలయ భక్తి సంఘం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కళాకారులు నృత్యం ప్రదర్శించారు. వీరికి రాజమండ్రికి చెందిన సురేష్‌బాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కర్వీనర్ గాది గంగబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఊరూరా చవితి సందడి

- వేడుకలకు సిద్ధమైన గ్రామాలు
- వాడవాడలా కొలువుతీరనున్న గణేశుడు
- కిటకిటలాడిన మార్కెట్లు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు: వినాయక చవితికి పల్లెలు సిద్ధమయ్యాయి. వాడవాడలా మందిరాలు ఏర్పాటు చేశారు. ఈ మందిరాల్లో గణపతి సోమవారం కొలువుతీరనున్నాడు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గణేశ్ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లోని వినాయకుని ఆలయాలను ముస్తాబు చేశారు. ఏలేశ్వరంలోని పాతబస్టాండ్, అడ్డతీగలరోడ్, నర్సీపట్నంరోడ్, కాలేజీరోడ్, లింగంపర్తిరోడ్, తోటవీధి, పెద్దవీధి, పల్లపువీధి, పలుకాలనీలు, మండలంలో వినాయకుని విగ్రహాలను నెలకొల్పనున్నారు. భక్తులు వినాయకుని ప్రతిమలతోపాటు పత్రి, పండ్లు, పుష్పాలు, పాళీలు, రకరకాల దండలు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో ఆరు అంగుళాల నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు ఉన్న మట్టి విగ్రహాలు రూ.30 నుంచి రూ.800 వరకు ధర పలుకుతున్నాయి. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.

గోకవరం : మండలంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం, అచ్చియ్యపేట, వెలమపేట, బత్తులవారి వీధి, మురళీనగర్, డ్రైవర్స్‌కాలనీ, పలు గ్రామాల్లో చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. గోకవరంలో వినాయకుని విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. వీటిని కొనుగోలు చేసిన అనంతరం ట్రాక్టర్లు, వ్యాన్ల వివిధ రకాల వాహనాల్లో తరలించేందుకు చిన్నా, పెద్దా తరలివచ్చారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న వినాయకుని ఆలయం వద్ద కమిటీ సభ్యులు చవితి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు వేశారు.

తుని: పట్టణంలోని ఆలయాలు, చవితి పందెళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్‌లో భక్తులు గణనాథుడికి పూజకు అవసరమైన పత్రి, పండ్లు, పిండ వంటలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. ధరలు కాస్త ఎక్కువగా ఉన్నా అన్ని వస్తువులు అందుబాటులో లభించాయి. పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో వినాయక మంటపాలను ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో గణపతి పండుగను జరుపుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు.

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు సత్యదేవుని వార్షిక కల్యాణ మండపంలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేయనున్నారు. తొమ్మిది రోజుల అనంతరం విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నారు. ఈ తొమ్మిది రోజులు రోజుకో అలంకరణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది పంపా రిజర్వాయర్‌లో పంపా ఘాట్ వెలుపల నిమజ్జనం చేయనున్నారు. అక్కడ అన్ని ఏర్పాట్లు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావును ఈఓ ఆదేశించారు.

**మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**

ఏలేశ్వరం: వినాయక చవితి పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరా స్వామి వారి(బాలాజీచౌక్) ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు, సుబ్బియ్యమ్మ కుమారుడు గోపు శ్రీనివాసరావు, తిరుమల శారీస్, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రగడ ప్రయాగమూర్తి ఆధ్వర్యంలో సుమారు 1800 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె. సత్యనారాయణ, జి.విజయ్ కుమార్, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తుని: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలంతా మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను పూజకు ఉపయోగించాలని సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి కోరారు. ఆదివారం స్థానిక గణపతినగర్ పార్కులో వాకర్స్‌కు ఉచితంగా మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను అందజేశారు. తెలుగు ప్రజలు ప్రథమ గణపతి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కుచ్చర్లపాటి భీమరాజు, ఎల్.అప్పారావు, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, పేరూరి కృష్ణ, సోమేశ్వరరావు, రాజు, తాకాసి అప్పారావు, కుసుమంచి సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: పవర్ యూత్ పేరిట గ్రామానికి చెందిన పేపకాయల శ్రీనివాస్(నాని) స్థానిక జ్యోతుల నెహ్రూ కోలనీలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు, పత్రి పంపిణీ చేశారు. 500 మట్టి విగ్రహాలు చేయించామని, వీటితోపాటు పత్రి రూడా పంపిణీ చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు.



తుని కొత్తపేటలో సర్వాంగ సుందరంగా తయారు చేసిన లక్ష్మీగణపతి ఆలయం



గోకవరంలో పత్రి అమ్ముతున్న వ్యాపారులు



ఏలేశ్వరంలో పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



ప్రత్తిపాడు హాస్టల్ వీధిలో వేదికను సిద్ధం చేస్తున్న మహిళలు



ఏలేశ్వరంలో సిద్ధంగా ఉన్న వినాయకుని విగ్రహాలు



ఏలేశ్వరంలో మట్టి వినాయక విగ్రహాలు అందజేస్తున్న దాతలు

### వేడుకల్లో తగు జాగ్రత్తలు తీసుకోండి



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ

గండేపల్లి: చవితి నవరాత్ర మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉత్సవాల నిర్వాహణ బాధ్యతలను ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వర్తించుకోవాలన్నారు. పూజ అనంతరం నిమజ్జంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈయన వెంట గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

జగ్గంపేట: స్థానిక పోలీసు స్టేషన్లో ఎస్సై నాగార్జున రాజు ఆధ్వర్యంలో మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీలకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద నిర్ణీత సమయం వరకే మైక్‌లు, సౌండ్ సిస్టమ్ ఉపయోగించాలన్నారు.ఎలాంటి అవాంచనీయం సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. పలు జాగ్రత్తలను వివరించారు.

కిర్లంపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సోమవారం నుంచి 9 రోజులు నిర్వహించే గణపతి ఉత్సవాల్లో ఎటువంటి వివాదాలకు తావులేకుండా చూడాలన్నారు. ఎస్సై పి.ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్**

ప్రత్తిపాడు రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. పోతులూరు సమీపంలో పంపు హౌస్ నుంచి పుష్కర ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు ఆయన చేతుల మీదుగా నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగునీరు అందజేస్తామన్నారు. ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాల మేలు చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమలో ఇరిగేషన్ డీఈ జయరాజ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ నాగులాపల్లి బాబ్జి, ఎంపీటీసీ అమరాది కాశీ, వైఎస్సార్ సీపీ నాయకులు రేఖ శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

# వైభవంగా విశ్వకర్మ జయంతి



ఏలేశ్వరంలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న దృశ్యం



విశ్వకర్మ చిత్రపటంతో ప్రదర్శన చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: సృష్టికర్త విశ్వకర్మ జయంతిని శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయం వద్ద సంఘ అధ్యక్షుడు సింహాద్రి వెంకట్రావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. విశ్వకర్మ పతాకాన్ని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధరణాలకోట శ్రీను ఆవిష్కరించి, చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ నాయకులు అరసాల చిట్టిబాబు, ధరణాలకోట తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పుర ప్రదర్శన నిర్వహించారు.

ఏలేశ్వరం: విశ్వకర్మ జయంతిని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకామాక్షి కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. విశ్వకర్మ మానవ జాతి మనుగడకు దిశానిర్దేశం చేశారన్నారు. విశ్వకర్మ సిద్ధాంతాలను నేటితరం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జామి ఆదినారాయణ, కొమ్మోజు అప్పలాచారి, సింహాద్రి బ్రహ్మం, వింజరపు సత్యనారాయణ, వింజరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమవరం గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు సరికొండ నూకరాజు, లావేటి అచారి, వీరవిల్లి త్రిమూర్తులు పతాకాన్ని ఆవిస్కరించి విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# బలరామ జయంతిని వేడుకగా నిర్వహించాలి

ప్రత్తిపాడు: రానున్న భాద్రపద షష్టికి కాకినాడ జిల్లాలో బలరామ జయంతిని వేడుకగా నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి కొలూరి పతిరాజు కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం బీకేఎస్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొలూరి పతిరాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలలో బీకేఎస్ మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు వేయని రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీకేఎస్ నాయకులు జాజిమొగ్గల ఈశ్వర్, దాడిశెట్టి జానకీ పావనిలక్ష్మి, భేరి రాము, దొడ్డిపట్ల సోమన్నదొర, కందా గోపాలకృష్ణ, శింగిలిదేవి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పతిరాజు

# గురువులపై భక్తిభావం కలిగి ఉండాలి

కాకినాడ కల్చరల్: గురువులపై భక్తిభావం కలిగి ఉండాలని సాహితీవేత్త డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా జగన్నాథ శర్మ కల్యాణ మండపంలో ఆస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పోతన భాగవతంపై ఉపన్యాసం జరిగింది. భాగవతంలోని షష్ఠమ స్కంధం నుంచి అమృత తుల్యమైన పద్యాలను జోస్యుల రాగయుక్తంగా ఆలపించి వాటి భావాలను వివరించారు. గురువును నిర్లక్ష్యంగా చూస్తే ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నవాడైనా పతనమవుతాడని ఆయన తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సమితి అధ్యక్షుడు గొట్టిముక్కల వెంకట సత్యనరసింహశాస్త్రి మాట్లాడుతూ భాగవతం మనిషిని సంస్కారిగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుందన్నారు. సమితి ఉపాధ్యక్షులు కారుప్రోలు గౌరినాయుడు, మార్ని జానకీరామ్‌చౌదరి, డాక్టర్ పొన్నపల్లి శ్రీరామారావు, చింతపల్లి సుబ్బారావు, అనురాధ, సిరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆశాజనకంగా 'తెల్లబంగారం'

- పూత, పిందె, కాయ దశలో పైరు
- 2,426 ఎకరాల్లో పత్తి సాగు

తుని రూరల్: మెట్ట ప్రాంత రైతుల తెల్లబంగారంగా భావించే పత్తిచేలు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలించడం, అధిక వర్షాలు లేకపోవడంతో ఆరుతడిగా సాగయ్యే పత్తిచేలు పూత, పిందెలు, కాయలు విరబూసి కళకళలాడుతున్నాయి. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం తగ్గడంతో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో 2394 మంది రైతులు 2426 ఎకరాల్లో ఖరీఫ్‌లో పత్తి వేశారు. వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధి ఐదు మండలాల్లో 1050 రైతులు 979 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా తుని మండలంలో 795 మంది రైతులు 734 ఎకరాలు, తొండంగి మండలంలో 49 మంది రైతులు 46 ఎకరాలు, కోటనందూరు మండలంలో ఒక రైతు మూడు ఎకరాలు, రౌతులపూడి మండలంలో 159 మంది రైతులు 131 ఎకరాలు, శంఖవరం మండలంలో 49 మంది రైతులు 65 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు.

**గిట్టుబాటు ధర పెరిగే అవకాశం**

గతేడాది క్వింటాల్ పత్తికి రూ.ఎనిమిది వేలు నుంచి రూ.పది వేలు వరకు గిట్టుబాటు ధర లభించింది. ఈ సంవత్సరం సాగు తగ్గడంతో పత్తికి డిమాండ్ పెరిగి గిట్టుబాటు ధర మరింత లభిస్తుందన్న ఆశాభావం రైతులు వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం ఇలాగే కొనసాగితే దిగుబడులు సైతం పెరుగుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావచ్చన్నారు. అక్టోబరు మొదటి వరం నుంచి ఫలసాయం లభించే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు రైతుల చీడపీడలను గుర్తించి నివారించుకోవాలని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంగే వ్యవసాయ అసిస్టెంట్ల సూచనాలు పాటించాలన్నారు.



ఎస్.అన్నవరంలో సాగవుతున్న పత్తి చేలు



పత్తిమొక్కలకు పూత, పిందెలు, కాయలు

### దానవాయిపేట తీరంలో 'స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్'



ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసిన మత్స్యకార యువత

తొండంగి: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ వ్యర్థాలతో ఉన్న సముద్ర తీరాన్ని పరిశుభ్రం చేసేందుకు ఇన్‌కాయిస్ ఆధ్వర్యంలో ఆదివారం దానవాయిపేటలో స్వచ్ఛ సాగర్–సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్), మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తాధ్వర్యంలో దానవాయిపేట సముద్రతీరాన్ని యువత శుభ్రం చేశారు. అనంతరం ఇన్‌కాయిస్ సైంటిస్టులు రాజేష్ కన్నా వనరుల సద్వినియోగం, సముద్రతీరంతోపాటు పరిసరాల పరిశుభ్రతలో వ్యర్థాలను వేరు చేసి సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మడదా హేమంత్, మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు, తీరప్రాంత గ్రామాల యువత, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలు జగన్‌తోనే సాధ్యం



గాదెలపాలెం ఆత్మీయ సమావేశం మాట్లాడుతున్న తోట నరసింహం

గోకవరం: సంక్షేమ పథకాలు అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. గాదెలపాలెంలో తుమ్మలపల్లి గంగాధర్, గునిపే ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీ సమావేశానికి తోట నరసింహం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్క రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలకు విజ్ఞాప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, గుల్లా ఏడుకొండలు, దాసరి చినబాబు, రామకుర్తి మూర్తి, ఇజ్జిన కిరణ్ కుమార్ కురాకుల సుమంగళి, పత్తి రమేష్, పలువురు ఉన్నారు.

### స్వచ్ఛభారత్‌పై వ్యాసరచన పోటీలు

సామర్లకోట: స్థానికంగా రైల్వే ఉద్యోగుల పిల్లలకు ఆదివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజయవాడ రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ప్రారంభించారు. చిన్నారులను వివిధ కేటగిరీలుగా విభజించి స్వచ్ఛ భారత్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జోగారావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు బహుమతులు అందజేశారు.